క్లుప్తంగా

వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ


డాక్టర్ బీఎస్.సాదియా

పెద్దతిప్పసముద్రం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా బీఎస్.సాదియా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో అనంతపురం జిల్లా నార్పల పీహెచ్‌సీలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అదే విధంగా ఇక్కడ మెడికల్ అధికారిగా పని చేసే పురుషోత్తం నాయక్ అనంతపురం జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో డాక్టర్ ఎండీ.యస్దానీ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో డాక్టర్ సాదియా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవ లందిస్తామన్నారు. ఆమెను ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులు

కలికిరి(వాల్మీకిపురం): బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దివంగత నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా వాల్మీకిపురంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన హిందూసాంప్రదాయ వాదిగా చేసిన సేవలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పులి నరేంద్రకుమార్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, విష్ణు చైతన్య, నవీన్, ప్రసాద్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మదనపల్లె రూరల్ : ద్విచక్రవాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్ రోడ్‌నెం.1లో నివాసం ఉన్న పి.వెంకటేష్ ఈనెల 19న తన ఇంటిముందు ఉంచిన హోండా యాక్టివా ఏపీ-39, ఎస్‌డీ-4450 ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు వెంకటేష్.. వాహనం కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో సోమవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టమాటా ట్రాక్టర్ బోల్తా


బోల్తా పడిన టమాటా ట్రాక్టర్

మదనపల్లె రూరల్ : టమాటా ట్రాక్టర్ బోల్తా పడి పంట నేలపాలైన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. కోటవారిపల్లెకు చెందిన రైతు గోవర్ధన్ పొలంలో కోసిన టమాటాలను 230 క్రేట్లలో నింపుకుని ట్రాక్టర్‌లో మదనపల్లె మార్కెట్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో..పట్టణంలోని కదిరి రోడ్డు వద్ద అకస్మాత్తుగా ట్రాక్టర్ ముందు టైర్ పేలడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో టమాటా పంట నేల పాలైంది. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఎవరూ గాయపడలేదు.

కనుల పండుగగా పంచామృతాభిషేకం


విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఏకకాలంలో శివలింగానికి, నందీశ్వరునికి జరిగిన పంచామృతాభిషేకం చూపరులను ఆకట్టుకుంది. మాస శివరాత్రి సందర్భంగా శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో కర్ణాటకకు చెందిన వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయంలో వివిధ అభిషేకాలను నిర్వహించారు. భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం

పెనగలూరు : చక్రంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి బొల్లా శ్రీనివాసులు నాబార్డులో ప్రస్తుతం అదనపు జనరల్ మేనేజర్‌గా పని చేయుచున్నాడు. పది వేల రూపాయలను పాఠశాల అభివృద్ధి కోసం ఆయన మిత్రుడు స్కూల్ అసిస్టెంట్ రామచంద్రయ్య ద్వారా ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణకు అందజేయడం జరిగింది. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయవచ్చని వారు పేర్కొన్నారు. ఈ నగదుతో స్టేజికి పెయింటింగ్ నిర్మాణాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

కూలిన రేకుల షెడ్డు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పుటికంవారిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వీచిన భారీ గాలులకు చిన్నపూలు నరసింహులు అనే వ్యక్తి రేకుల షెడ్డు నేలకొరిగింది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నరసింహులు రేకుల షెడ్డు పడిపోవడంతో నిరాశ్రయుడయ్యాడు.

భూమి అనుభవంలో ఒకరు..ఆన్‌లైన్‌లో మరొకరు

- అర్జీలు ఇచ్చినా ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్య
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రైతు ఆవేదన


ప్రజాసమస్యల పరిష్కార ఫిర్యాదు వేదికలో డీఏఓ నిర్మలాదేవికి సమస్యలపై వివరిస్తున్న ప్రజలు

మదనపల్లె రూరల్ : తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న వ్యవసాయభూమిని, రెవెన్యూ అధికారులను లోబర్చుకుని కొందరు ఆన్‌లైన్‌లో తమపేరు మీదకు మార్పించేశారని, రద్దుచేయాల్సిందిగా కోరుతూ ఏళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని రైతు వాపోయాడు. సోమవారం మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అందుబాటులో లేకపోవడంతో ఆయన స్థానంలో డీఏఓ నిర్మలాదేవి అర్జీలు స్వీకరించారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె గ్రామం యాలగిరిపల్లెకు చెందిన రైతు పి.హనుమంతు.....గ్రామంలోని సర్వేనెం.1793/1లో 5 ఎకరాలు, 1793-2-ఎలో పుంజ 1.46 ఎకరాల భూమి తన తాత పి.వెంకటస్వామి పేరుపై ఉందన్నారు. దీనికి సంబంధించిన పన్ను రశీదులు తాత పేరుమీదే ఉన్నాయన్నారు. భూమి తమ అనుభవంలోనే ఉందన్నారు. అయితే..తమ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు.. పి.రవి, పి. వెంకటరమణ, పి.శ్రీనివాసులు రెవెన్యూ అధికారులను లోబర్చుకుని, తమకు తెలియకుండా ఆన్‌లైన్‌లో మొత్తం 5 ఎకరాల భూమిని వారిపేరు మీదకు మార్పించేశారన్నారు. రెవెన్యూ అధికారులకు ఈ విషయమై పలుమార్లు అర్జీలు సమర్పించినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా వారిపేర్లు ఆన్‌లైన్‌లో రద్దుపరిచి తమకు న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నాడు.

- కాళ్లు, చేతులు పడిపోయి పక్షవాతంతో బాధపడుతున్న తన భర్త చంద్రకు పెన్షన్ మంజూరుచేయాలని బసినికొండకు చెందిన రేణుక అర్జీ సమర్పించింది. సదరం సర్టిఫికేట్ లేని కారణంగా తన భర్తకు పెన్షన్ మంజూరు కాలేదని, సదరం సైట్ ఓపెన్ కాకపోవడంతో ఏడాదిన్నర కాలంగా పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పుకొచ్చింది.
- మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన దివ్యాంగుడు కొప్పుల చంద్ర...ఖాతానెం.1655లో ఉన్నటువంటి భూమికి దారి సౌకర్యం లేదని, భూమికి పక్కన వంక పోరంబోకు భూమి ఉందని, అందులో నుంచి తన భూమికి దారి ఏర్పాటుచేయాలని కోరాడు.
- మదనపల్లె మున్సిపాలిటీ, మాయాబజార్‌లోని డోర్‌నెంబర్ 3-146-23లో 36 సంవత్సరాలుగా కృష్ణ శ్రీరాములు అయిన తాను స్థిర నివాసం ఉంటుండగా, మున్సిపల్ అధికారులు తన ఇంటికి సంబంధించిన పన్ను, నీటిపన్నును విజయభారతి పేరు మీద వేస్తున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులను కలిసి అర్జీలు సమర్పించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలి

- నిరుద్యో భృతి హామీ ఏమైంది
- మదనపల్లె నుంచి యువతపోరుకు భారీగా తరలిన యువత


యువత పోరుకు మదనపల్లె నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ యువజన శ్రేణులు

మదనపల్లె: ఎన్నికల్లో నోటికొచ్చిన హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలను మోసం చేసినట్టుగానే నిరుద్యోగ యువతను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం రాయచోటి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో యువతతో కలిసి హాజరయ్యేందుకు ప్రదర్శనగా మదనపల్లె నుంచి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి ఇవ్వాలని నినాదాలు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగులకు భృతి ఇస్తామని నమ్మించి గెలిచాక మోసం చేశారని, ఇప్పుడు మళ్లీ ఇదే మోసం చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ఉపాధి లేక,ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు లభించక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి ఏడాదిగా చెల్లించాల్సిన భృతిని బకాయిలతో కలిపి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతోందని, అండగా ఉంటుందని అన్నారు. యువత పోరు కార్యక్రమానికి నిరుద్యోగుల నుంచి మంచి స్పందన లభించిందని, ఇది కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతను బహిర్గతం చేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాని బాబాయి, మల్లికార్జున రెడ్డి, మహి, పూర్ణ, రాజు, శారద, నాగమణి పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన హరీష్‌రెడ్డి

పీలేరురూరల్ : వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఏపీ ఎండీసీ మాజీ డైరెక్టర్ సి. హరీష్‌రెడ్డి తిరుపతిలో మాజీ మంత్రిని కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడి వారికి భరోసా కల్పించాలన్నారు.

మదనపల్లెలో నీళ్లు, లైట్లు సేవలు నిలిపివేత

-కార్మికుల నిరసన ప్రదర్శన


మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన

మదనపల్లె: పట్టణంలో 20 రోజులుగా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం ప్రజలు అందిస్తున్న సేవలను నిలిపివేశారు. విధులు బహిష్కరించిన కార్మికులు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ ఆగిపోయింది.సేవలకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు విధులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లకు సత్వరమే ఆమోదం తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరాహర దీక్షలు చేస్తున్నా, విధులను బహిష్కరించినా ప్రభుత్వానికి సంబంధం లేనట్టు వ్యవహరిస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన అనంతరం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల కనీస డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం విముఖత చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనం, కనీస సౌకర్యాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగరాజు, బాబు, బాలకృష్ణ, సజాద్, కుమార్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలని వినతి


డీటీని సన్మానిస్తున్న మాల మహానాడు నేతలు

కలికిరి: దళితుల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు నేతలు డిప్యూటీ తహసీల్దారు సయ్యద్ అహ్మద్‌ను కోరారు. సోమవారం కార్యాలయంలో డీటీని కలిసిన మాలమహానాడు నేతలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని దళితుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తగిన న్యాయం చేయాలన్నారు. మాల మహానాడు రాయలసీమ కన్వీనర్ యామలా చంద్రయ్య, ఉపాధ్యక్షులు గుండా మనోహర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్టీడి హరి, మల్లెల మోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సర్వేయర్లు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సర్వేయరు

కలకడ : ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీఓ 01 నుంచి 05 అలాగే 206 జీఎస్‌డబ్ల్యూఎస్ , జనరల్ సర్వీసెస్ ప్రకారం రెండు సచివాలయాలకు కలిపి ఒక్క విలేజ్ సర్వేయర్‌ను కేటాయించడం ద్వారా మిగిలిన సిబ్బంది పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ మహేశ్వరిభాయ్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వీలేజ్ సర్వేయర్లు అందజేశారు. సోమవారం తహసీల్దార్‌కు వారి సమస్యలను వివరించారు. ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి అయినా ఎలాంటి పరిష్కారం చూపలేదని, న్యాపరమైన విన్నపాలు పరిష్కరించేంత వరకూ పెన్‌డౌన్ చేస్తామన్నారు. సర్వేయర్ల హేతుబద్ధీకరణ, వారి సమ్మతితో బదిలీ, పదోన్నతి బదిలీ పారదర్శకంగా జరగాలని డిమాండ్ చేశారు. అంతర్ జిల్లాల బదిలీలు, మ్యూచువల్ బదిలీలు ఇవ్వాలన్నారు. ఆర్ఓఆర్ సెటిల్ చేయకుండా, తగిన పరికరాలు ఇవ్వకుండా రీసర్వే సకాలంలో పూర్తి చేయమనడం సరికాదన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


మాట్లాడుతున్న ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయిందని, ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు హాజరు కావాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో చేర్పించి, వంద శాతం నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు మురళీధర్‌రాజు, అశోక్, మాధవి, నాగరాజ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల సత్తా


ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రాజేంద్రబాబు

మదనపల్లె సిటీ: జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో మదనపల్లె మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. వివేకానంద (ఆర్ ఆర్ లేవుట్) మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 29 మంది, వివేకానంద (మాయబజార్) మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 7 మంది, బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందుతుంది. ఎంపికైన విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రబాబు, విజయలక్ష్మి, మునినాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

26న ఉపాధి పనులపై బహిరంగ సభ

రాజంపేట టౌన్ : ఈ నెల 26వ తేదీ ఉదయం పది గంటల నుంచి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పగడాల వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం ఈనెల 1వ తేదీ నుంచి తనిఖీ చేస్తోందన్నారు. తనిఖీలో కనుగొన్న విషయాలపై బహిరంగ సభలో చర్చించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. సభలో ప్రజాప్రతినిధులు, రైతులు, ఉపాధి కూలీలు, సిబ్బంది, ఉపాధి హామీ అనుసంధాన శాఖల సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

స్మశాన వాటికల స్థలాలు కాపాడాలి

తహసీల్దార్ శివకుమార్‌కు అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడి ఫిర్యాదు


తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గుర్రం నారాయణ

పీలేరు : మండలంలో స్మశాన వాటికల స్థలాలు కాపాడాలని అఖిలభారత మాల సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గుర్రం నారాయణ కోరారు. మండలంలోని పలు ప్రాంతాల్లో స్మశాన స్థలాలు, వంకలు దురాక్రమణ జరిగాయని సోమవారం స్థానిక తహసీల్దార్ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దొడ్డిపల్లె, బాలంవారిపల్లె, గూడరేవుపల్లె దళిత గ్రామాల్లో స్మశాన వాటికలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. సర్వే నిర్వహించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నాగరాజు, సురేంద్ర పాల్గొన్నారు.

300 లీటర్ల సారా ఊట ధ్వంసం

- 10 లీటర్ల సారా స్వాధీనం
- నల్లబెల్లం విక్రయించిన వ్యాపారి, సారా విక్రేత అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె రూరల్ : నిమ్మనపల్లె మండలం గారబురుజు అటవీప్రాంతంలో మదనపల్లె ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో 300 లీటర్ల సారా ఊట ధ్వంసం చేయడంతో పాటు 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...గారబురుజుకు చెందిన పి.వెంకటరమణ, అటవీప్రాంతంలో సారా బట్టీ నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి, సారా తయారీకి నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటతో పాటు 10 లీటర్ల సారాను గుర్తించామన్నారు. వెంకటరమణను అరెస్ట్‌చేసి, నాటుసారా తయారీకి ముడిసరుకుల సరఫరా గురించి విచారిస్తే..మదనపల్లె టౌన్, చిత్తూరుబస్టాండ్‌లోని మహేష్ జనరల్ స్టోర్స్ నుంచి నల్లబెల్లం కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో అతడి వాంగ్మూలం ఆధారంగా మహేష్ జనరల్ స్టోర్స్‌లో సోదాలు నిర్వహించి, 15 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకోవడంతో పాటు రాంగోపాల్‌నాయుడు వీధికి చెందిన దుకాణ యజమాని వి.సత్యనారాయణ కుమారుడు వి.మహేష్‌ను అరెస్ట్ చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు వీరనాగయ్య, మధుసూధన్, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల సంక్షేమానికి పెద్ద పీట


ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న దూదేకుల సంఘం నాయకులు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: జగన్‌తోనే దూదేకుల సామాజిక వర్గానికి గుర్తింపు గౌరవం లభించిందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మండలంలోని దూదేకుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేని కలిసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ పాలనలో దూదేకుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రాజకీయాల్లోను, పదవుల్లోనూ సముచిత స్థానం కల్పించారన్నారు. దూదేకుల పట్ల కించపరిచేలా ఉన్న వ్యాఖ్యలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జీఓ ఇచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. దూదేకులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కూడా జగన్‌దేనన్నారు. జగన్‌కు మద్దతుగా మరోసారి అందరూ కలసి రావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలోని పిచ్చలవాండ్లపల్లె గ్రామంలో పర్యటించారు. ఇటీవల ప్రమాదానికి గురైన లక్కసముద్రమం వైఎస్సార్ సీపీ నాయకులు డి. ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించారు. పార్టీకి చెందిన మరో నాయకుడు మేకలవారిపల్లెకి చెందిన మేకల సురేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబీకులను ఆప్యాయంగా పలకరించారు. ప్రతి నాయకుడు, కేడర్‌కు, కార్యకర్తకు పార్టీతో పాటు పెద్దిరెడ్డి కుటుంబం అండదండగా ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తంబళ్లపల్లె: మండలంలోని ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లె పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పర్యటించారు. ఇటీవల తిమ్మయ్యగారి ఇండ్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ద రమణ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుడి కుమారుడు సోమశేఖర్‌కు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఎద్దులవారిపల్లెకు చెందిన అన్వర్ కుమార్తె ఆరీఫా ఇటీవల ప్రమాదంలో గాయపడింది. ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి ఆరీఫా ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. వైద్య చికిత్సల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. ఎలాంటి కష్టనష్టాలు వచ్చినా అండగా ఉంటానని బాధితులకు భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు రెడ్డప్పరెడ్డి, వెంకటరెడ్డి, ప్రకాష్, సాంబశివారెడ్డి, పాపినాయుడు,కరీముల్లా,పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

అమ్మ జ్ఞాపకానికో మొక్క


మొక్కలు అందిస్తున్న మురళీరెడ్డి

బి.కొత్తకోట: కుటుంబ పెద్దలు చనిపోతే కర్మక్రియలను కుటుంబీకులు, బంధుమిత్రులతో నిర్వహించడం సాధారణంగా చూస్తుంటాం. అయితే బి.కొత్తకోట మండలం గుడిపల్లెకి చెందిన స్థిరాస్తి వ్యాపారి మాచిరెడ్డి మురళీరెడ్డి తల్లి మద్దమ్మ ఈనెల 13న మృతి చెందింది. సోమవారం గుడిపల్లెలో వైకుంఠ సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఇవ్వడానికి తల్లి జ్ఞాపకార్థంగా మురళీరెడ్డి కొబ్బరి మొక్కలను తెప్పించారు. ప్రతిఒక్కరికి ఒక కొబ్బరి మొక్కను పంపిణీ చేశారు. మొక్క ఇస్తూ దాన్ని నాటి పర్యవేక్షణ చేస్తూ పెంచాలని కోరారు. పర్యావరణ కాపాడటం, అధికసంఖ్యలో మొక్కలు నాటాలని హాజరైన వారికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు చింపిరి అమరనాథరెడ్డి, వైస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మొరుంపల్లె రమేష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ దురాక్రమణపై అధికారుల విచారణ


అంగళ్లులో భూ ఆక్రమణపై విచారిస్తున్న రెవెన్యూ అధికారుల

కురబలకోట: అంగళ్లులో గాండ్లపెంట శకుంతలకు చెందిన భూ ఆక్రమణపై ఇటు రెవెన్యూ మరో వైపు పోలీసులు ఆదివారం విచారణ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. సాక్షిలో భర్త మరణాన్ని మరువక ముందే భూమి ఆక్రమణ..న్యాయం చేయకపోతే సామూహిక ఆత్మహత్యే శరణ్యం అనే వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. అంగళ్లులో ఆక్రమిత భూమి వద్ద అత్త బిడ్డలతో కలసి శకుంతల నిరసన చేపట్టిన విషయం విదితమే. దీనిపై సంఘటన స్థలానికి వెళ్లి విచారణ నిర్వహించారు. బాధితురాలు శకుంతలను కలసి పూర్వాపరాలు విచారించారు. భూ రికార్డులను పరిశీలించారు. పెద్దల కాలం నుంచి కూడా వంశ పారంపర్యంగా ఈ భూమి బాధితురాలు శకుంతల కుటుంబీకుల ఆధీనంలో ఉన్నట్లు పరిసర ప్రాంత రైతులు కూడా ఈ సందర్భంగా రెవెన్యూ,పోలీసు అధికారులకు తెలిపారు. తగు చర్యలు తీసుకుంటామని శకుంతలకు తెలిపారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ వంశ పారం పర్యంగా వస్తున్న తమ భూమిని తుమ్మచెట్లపల్లెకు చెందిన అన్నదమ్ములు అక్రమంగా ఆక్రమించడం దుర్మార్గమన్నారు. తప్పుడు రికార్డులు సృష్టించి లేని భూమిని ఉన్నట్లు దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. అంగళ్లులో రోడ్డు పక్క భూములకు విలువ రావడంతో భూ ఆక్రమణదారులు ఈదుశ్చ్యలకు దిగుతున్నారన్నారు. ఓ పోలీసు అధికారి అండతోనే వారు భూఅక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. లంచాల మైకంలో ఆ అధికారి కూడా వీరికి పరోక్షంగా భూ అక్రమాలకు వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ఇతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. చావనైనా చస్తాం కాని భూమిని వదులుకునే ప్రసక్తే లేదన్నారు. అక్రమంగా భూమిని ఆక్రమించడంతో పాటు తనను వివిధ రకాలుగా వేధించడం భయపెట్టడం లాంటి చర్యలు చేపడుతున్నారన్నారు. ఇలాంటి వాటికి భయపడేది లేదన్నారు. తనను వేధిస్తున్న భూ అక్రమార్కులపై మహిళా కమిషన్‌కు, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. మరో వైపు పోలీసులకు కూడా వీరి వేధింపులు, బెదిరింపులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

రాజంపేట : పట్టణంలో భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి రాజంపేట మున్సిపాలిటీ కమిషనరు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తన చాంబరులో ఆయన మాట్లాడుతూ అనుమతుల కోసం లైసెన్సుడే టెక్నికల్ పర్సస్ ద్వారా రూల్స్ మేరకు కట్టి సమర్పించుకోవాలన్నారు. అప్పుడే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీపై తప్పకుండా ఏపీ బిల్డింగ్ రూల్స్ 2017 అనుసరించి పరిశీలించడం జరుగుతుందన్నారు. మధ్యవర్తులు డబ్బులు అడిగా, హామీలతో మోసపోరాదన్నారు. అనుమతులు లేకుండా ఇళ్ల అక్రమ నిర్మాణాలు, అనధికారిక లేఔట్లలో ప్లాట్ కొనడంగానీ, నిర్మాణం గానీ చేయరాదన్నారు. ఆ విధంగా చేపట్టిన నిర్మాణాలకు మున్సిపల్ చట్టం 1965 ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలందరికీ తెలియజేస్తున్నామన్నారు.

మద్దతు ధరకే కొనుగోలు చేయాలి

సుండుపల్లె : తోతాపురి మామిడికాయలను మద్దతు ధరకే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సుండుపల్లెలో మాట్లాడారు. తోతాపురి మామిడి కాయలు రైతుల పాలిట శాపంగా కాకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను కాపాడాలని కోరారు.